ప్రజాశక్తి
శనివారం 6 మే 2023 5
పార్వతీపురం మన్యం



పురుగుమందు తాగి డిజిటల్ అసిస్టెంట్ మృతి



ప్రజాశక్తి -భామిని

మండలంలోని సింగిడికి చెందిన మాలి రవి (35) పురుగుమందు తాగి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుమందు తాగడని, వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ తరలించగా అక్కడ మరణించాడని తెలిపారు. రవి బాలేరు -2 సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య అర్చన, కుమారుడు శుభమ్ వున్నారు. బత్తిలి ఎస్ఐ వై. అమ్మన్నారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సంస్కరణలను తిప్పి కొడితేనే

ప్రభుత్వ విద్యారంగానికి రక్షణ

శేషగిరి స్ఫూర్తితో విద్యా రంగంలో మతతత్వ భావాలను అడ్డుకోవాలి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు



శేషగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను తిప్పికొట్టడం ద్వారానే ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోగలమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. రాజ్యాంగం కల్పించిన లక్ష్యాలను అమలు పర్చడం ద్వారానే దేశం సుసంపన్నం అవుతుందని అన్నారు. అందుకోసం నిరంతరం పని చేసిన శేషగిరి మాస్టారి స్ఫూర్తితో ఉద్యమించాలని ఉపాధ్యాయు లకు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు.యుటిఎఫ్ నాయకులు కోరెడ్ల శేషగిరి 2వ వర్ధంతిసభ శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యాన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. తొలుత శేషగిరి చిత్ర పటానికి కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'భారత రాజ్యాంగం – ఆర్థిక విధానాలు – సామాజిక న్యాయం' అనే అంశంపై లక్ష్మణరావు స్మారకోపన్యాసం చేశారు. రాజ్యాంగం అమలు జరిపి నేటికి 73 ఏళ్లు అయిందన్నారు. రాజ్యాంగం దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం కల్పించిందన్నారు. సంపద కొద్ది మంది చేతుల్లో కాదు అందరి చేతుల్లో ఉండాలని రాజ్యాంగం చెప్పిన లక్ష్యాలు నేడు దేశంలో అమలు కావడం లేదన్నారు. ప్రధానంగా సంపద ప్రజలకు చెందాలని, ఉత్పత్తి సాధనాలపై ప్రభుత్వ ఆదిపత్యం ఉండాలని, శ్రమ జీవులకు కనీస వేతనాలు, పని గంటలు అమలు కావాలని, ఉపాధి అవకాశాలు కల్పించి, ఉచిత ప్రాథమిక విద్యను అమలు చేయాలని రాజ్యాంగంలో ఉందన్నారు. రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగానే 1990 వరకు ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు, ఉచిత విద్యా వైద్యం ఏర్పాటు జరిగిందన్నారు. 1991లో నూతన ఆర్థిక విధానాలను అమలు చేసిన తర్వాత రాజ్యాంగ లక్ష్యాలకు తూట్లు పడ్డాయన్నారు. కొద్ది మంది చేతుల్లోకి సంపద పోగిపడే పాలన సాగుతుందన్నారు. అందులో భాగంగానే ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్ఇపిని అమలు చేయడం, సిలబస్‌లో మార్పులు తీసుకురావడం, మతతత్వ భావాలను పాఠ్యాంశాల్లో చేర్పించడం వంటి చర్యలు కు పాల్పడుతున్నారన్నారు. గత 30 ఏళ్ల కాలంలో రాజ్యాంగ లక్ష్యాలకు దూరంగా పాలన సాగుతుందన్నారు. అందుకు ఉదాహరణే 50 వేల కోట్లు ఆస్తి ఉన్న అదాని మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత పది లక్షల కోట్లు ఆస్తులు సంపాదించారని అన్నారు. సామాజిక న్యాయంలో కీలక పాత్ర విద్యారంగానిదని, అటువంటి విద్యా రంగంలో చరిత్రను వక్రీకరించి, శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయకుండా మతతత్వ భావాలతో కూడిన విద్యా విధానం అమలుకు పూనుకుంటున్నారని ఆవేదన చెందారు. సామాజిక ఐక్యతను కలిగించే పాఠ్యాంశాలను తొలగించే ప్రయత్నం జరుగుతోందన్నారు. రాజ్యాంగ లక్ష్యాలు అమలు జరగాలంటే ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను తిప్పి కొట్టాలని, అప్పుడే దేశానికి, ప్రజలకు,ప్రభుత్వ రంగానికి, సామాజిక న్యాయానికి అవకాశం ఉంటుందని అన్నారు. అటువంటి ఉద్యమ స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా విధానం కోసం, అసమానతలు లేని సమాజం కోసం శేషగిరి కృషి చేశారన్నారు. ఎన్ఇపిని పూర్తిగా అధ్యయనం చేసి 20 వ్యాసాలు రాసారంటే విద్యారంగంపై ఆయన ముందు చూపునకు నిదర్శనమన్నారు. ఏదైతే సమ సమాజం కోసం ఐక్య ఉద్యమాలు చేపట్టడానికి కృషి చేశారో ఆ కృషిని కొనసాగించాలని, అప్పుడే శేషగిరికి నిజమైన నివాళి అని అన్నారు. అందుకు వేదికగా శేషగిరి విజ్ఞాన కేంద్రం ఉండాలని ఆకాంక్షించారు. ఎపిటిఫ్ 257 నాయకులు షేక్ భుకారి బాబు, ఎపిటిఫ్ 1938 జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు మాట్లాడుతూ శేషగిరి ఎన్నో ఐక్య ఉద్యమాలకు ఆద్యుడని అన్నారు. సమస్య ఏదైనా అధ్యయనం చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో చైతన్యం తీసుకు రావడంలో ఆయన స్ఫూర్తిదాయకుడని కొని యాడారు. నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఆయన అందించిన స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం శేషగిరి తో ఉన్న అనుబంధాలను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మోహనరావు, డి.రాము తదితరులు తెలిపారు. కె.విజయగౌరి మాట్లాడుతూ శేషగిరి పోరాట స్ఫూర్తిని ఉపాధ్యాయులు కొనసాగించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు సత్య శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవి అర్‌కెఈశ్వరరావు, నాయకులు పార్వతి, అప్పల నాయుడు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్, సిఐటియు నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, ఎల్ఐసి యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్, నాల్గో తరగతి ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు గంగా ప్రసాద్, శేషగిరి సతీమణి హేమలత, కుమారులు, జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ఉపాధ్యా యులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కలెక్టరేట్ : ఉపాధ్యాయ ఉద్యమ నేత, యుటిఎఫ్ నాయకులు కీర్తిశేషులు కోరెడ్ల శేషగిరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ హోంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్త దాన శిబిరాన్ని ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు, జెఎసి చైర్మన్ జి.కిశోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేషగిరి ఉపాధ్యాయ ఉద్యమ నేత గానే కాక, గిరిజన, దళిత, పీడిత ప్రజా ఉద్యమ నేతగా కూడా ఉన్నారని తెలిపారు. యుటిఎఫ్ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాడడమే కాకుండా సామాజిక స్పృహ కలిగిన సంఘంగా కూడా ఉన్నారని అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువ మంది గిరిజనులు రక్తహీనతతో బాధపడుతున్నారని, అందుకే ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 20మంది ఉపాధ్యాయులు రక్తదానం చేశారని తెలిపారు. వీరందరికీ ఉద్యమ జేజేలు పలుకు తున్నామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, జిల్లా ట్రెజరర్ మురళి, మండలాల నాయకులతో పాటు జిల్లా ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి రాజన్నదొరకు వినతిని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు

గ్రామాల మ్యాపింగ్‌పై జాగ్రత్తలు తీసుకోవాలి : రాజన్నదొర


- స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించాలి
- జిల్లా కలెక్టర్, డిఎంహెచ్‌ఒలకు ఆదేశాలు

ప్రజాశక్తి - సాలూరు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సమీపంలో ఉన్న గ్రామాలను మ్యాపింగ్ చేయాలని డిప్యూటీ సీఎం రాజన్నదొర డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నివాసంలో సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు రాజన్నదొరకు పిహెచ్‌సిలకు గ్రామాల మ్యాపింగ్ వల్ల ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలియజేస్తూ వినతిని అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో మాదిరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గ్రామాల మ్యాపింగ్ చేయొద్దని సూచించారు. మ్యాపింగ్‌కు రెండు రోజులే గడువు ఇవ్వడంతో ఆదరాబాదరాగా చేయొద్దని కోరారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, డిఎంహెచ్‌ఒలు ఈసారి గ్రామాల మ్యాపింగ్‌లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరమైతే తాను సంబంధిత వైద్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో మాట్లాడి గడువు పెంచేలా చూస్తానని చెప్పారు. మండలాల్లో గల పిహెచ్‌సిలతో గతంలో గ్రామాల మ్యాపింగ్ వల్ల గిరిజన గ్రామాల ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారని చెప్పారు. సాలూరు మండలంలోని జిల్లేడువలస పంచాయతీ మామిడిపల్లి పిహెచ్‌సికి దగ్గరలో ఉంటుందని తెలిపారు. గతంలో జిల్లేడువలసను తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో మ్యాపింగ్ చేయడంతో ఆ గ్రామాల గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. కొదమ పంచాయతీని తోణాం పిహెచ్‌సితో మ్యాపింగ్ చేయడం వల్ల ఆ గ్రామాల గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. జిల్లేడువలస పంచాయతీని మామిడిపల్లి పిహెచ్‌సితో, కొదమ పంచాయతీని మక్కువ లేదా శంబర పిహెచ్‌సితో మ్యాపింగ్ చేయాలని కోరారు. ఇలాంటి సమస్యలు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ఉన్నాయని, గతంలో మాదిరిగా అలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పిహెచ్‌సిలతో గ్రామాల మ్యాపింగ్ చేస్తున్నప్పుడు సంబంధిత వైద్యాధికారులు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులతో సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. రెండు రోజులే గడువు వుందని హడావుడిగా మ్యాపింగ్ చేయొద్దని సూచించారు. గతంలో జరిగిన తప్పులు పునరావతం అయితే వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని రాజన్నదొర హెచ్చరించారు. వైసిపి నాయకులు పి.చినబాబు, దండి శ్రీనివాసరావు వినతిపత్రం అందజేసిన వారిలో వున్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పాచిపెంట : గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్ఐ ఎంవి రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం సాయంత్రం పి.కోనవలస చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఒడిశాలోని మల్కాజ్‌గిరి జిల్లా బలిమెలకు చెందిన కుమ హంటల్ బైక్‌పై గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడి నుంచి ఐదున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కుమ హంటల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



లబ్ధిదారులకు చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

340 మందికి కళ్యాణమస్తు నిధులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో జనవరి నుంచి మార్చి త్రైమాసానికి సంబంధించి 340మంది దంపతులకు రూ.2.28కోట్లు వైఎస్సార్ కళ్యాణమస్తు విడుదల చేసినట్లు కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సిఎం కార్యాలయం నుంచి నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టరు కార్యాలయం నుంచి అధికారులు, లబ్దిదారులు వర్చువల్‌గా హాజరైనారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీటనొక్కి డబ్బులను నేరుగా లబ్దిదారుల ఖాతాలోనికి జమచేశారు. పెళ్లి చేసుకొని నూతన జీవితాన్ని ప్రారంభించిన దంపతులకు కలెక్టరు నిశాంత్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కనీసం పదోతరగతి చదివిన వధువుకు 18 ఏళ్లు, వరునికి 21 ఏళ్లు నిండి వివాహం చేస్తుకున్న వధూవరులు వివాహమైన 30 రోజుల లోపు తమ దగ్గర్లోని గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందవచ్చునని తెలిపారు. దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఫిబ్రవరి, మే, ఆగస్టు, నవంబర్‌లో ఆయా త్రైమాసికాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయడం జరుగుతుందని అన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వధువులకు వారి ఖాతాలోను, అదే కులంలో వివాహాలు చేసుకున్న వధువులకు వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సాయం జమ చేస్తోందని జిల్లా కలెక్టరు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి కిరణ్ కుమార్, వెలుగు ఎపిడి సత్యం నాయుడు, సాంఘిక సంక్షేమ అధికారి మహమ్మద్ జియాఉద్దీన్, వధూవరులు, వధువుల తల్లులు పాల్గొన్నారు.

సిఎంఒ బదిలీలు రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధ్యాయ సంఘాలతో బదిలీల కోసం విద్యా శాఖ మంత్రి సమావేశం పెట్టి మరో వైపు దొడ్డి దారిన సుమారు 170 మందిని బదిలీలు చేయడం, బదిలీల కోసం వేచి చూసే లక్ష మంది ఉపాధ్యాయులకు అన్యాయం చేయడమేనని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు అన్నారు. దొడ్డి దారిన బదిలీలైన ఉపాధ్యాయులందరికీ పట్టణాలకు, పట్టణ సమీప ప్రాంతాలకు అంటే హెచ్‌ఆర్‌ఎ ఎక్కువ శాతం ఉన్న స్థలాలకు బదిలీలు చేయడం అంటే అయివాడికి గుండెకాయ కానోడిక ఎముకలు అన్న చందంగా ప్రభుత్వం తీరు ఉందని ఆయన అన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో అక్రమ బదిలీలు జరిగితే ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడిచి అన్యాయం చేస్తున్నారని జగన్ అన్నారని, మరి ఇప్పుడు అదే అక్రమ బదిలీలు జగన్ ప్రభుత్వం చేస్తే దీనికి ఏం సమాధానం చెబుతారని అన్నారు. బదిలీల కోసం ఏడాది నుంచి ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారని, అయినా ప్రభుత్వం బదిలీలు చేయలేక పోయిందని, కానీ అక్రమ బదిలీలు మాత్రం చేస్తున్నారని విమర్శించారు. ఈ అక్రమ బదిలీలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

8 కేంద్రాల్లో పాలిసెట్

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఈనెల 10న జరగనున్న పాలిసెట్ పరీక్ష ఎమ్మార్ నగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరిధిలో 8కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ విలియం కేరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురంలో 1350 మంది అభ్యర్థులు హాజరయ్యే ఈ పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాల (బెలగాం), డివిఎం మునిసిపల్ హైస్కూల్ (బెలగాం), ప్రభుత్వ పాలిటెక్నిక్ (ఎమ్మార్ నగరం). శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కొత్తవలస), ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (బెలగాం), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఆర్టీసీ కాంప్లెక్స్) కేంద్రాలు కేటాయించినట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే ఈ పరీక్షకు విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందు హాజరు కావాలన్నారు. పరీక్ష ప్రారంభమైన 11గంటల తర్వాత పరీక్ష హాల్లోకి అనుమతించబడరని తెలిపారు. అలాగే విద్యార్థులు మధ్యాహ్నం 1.00 గంటకు ముందు పరీక్ష హాల్ నుంచి బయటకు అనుమతించబడరన్నారు. విద్యార్థులు బాల్ పాయింట్ పెన్, హెచ్‌బి లేదా 2 బి పెన్సిల్, ఎరేజర్, షార్పెనర్, హాల్ టిక్కెట్‌ను మాత్రమే పరీక్ష హాల్‌కు తీసుకురావాలని, విద్యార్థులు పరీక్ష తర్వాత ప్రశ్నాపత్రం బుక్‌లెట్లను తిరిగి తీసుకోవచ్చని, అభ్యర్థులు https://polycetap.nic.in వెబ్‌సైట్ నుండి హాల్‌టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు తెలిపారు.

రీ సర్వే సమగ్రంగా ఉండాలి

సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశం



సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

గ్రామాల్లో భూ తగాదాలు లేకుండా రీసర్వే సమగ్రంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ సర్వేయర్లు, రెవెన్యూ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ మండల రెవెన్యూ ఉద్యోగులతో సమావేశమయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే ప్రజల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎవరి భూములు వారికి చెందేలా సమగ్ర పరిశీలన చేసి సక్రమంగా రైతులకు భూములు ఉండేలా సర్వే ఉండాలన్నారు. భవిష్యత్తులో రైతాంగం ఎటువంటి ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వ భూములు, జిరాయితీ భూములు సక్రమంగా ఉండేలా సర్వే నిర్వహించాలని అన్నారు. మండలంలో సర్వే వేగవంతం చేయాలని ప్రతి రైతుకు తెలిసేలా సర్వే నిర్వహించాలని ఏ రైతును విడిచి పెట్టకూడదని సబ్‌కలెక్టర్ అన్నారు.

అంకవరం రైతుల భూములపై పరిశీలన

అంకవరం రైతులు సబ్‌కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేయడంతో ఆయన ఆ గ్రామ రైతులతో చర్చించారు. 30 ఏళ్లుగా డి-పట్టా ఉండి సాగు చేసుకుంటున్నామని, ఆ భూమి తప్ప వేరే భూమి తమకు లేదని, ప్రస్తుతం ఆ భూమి తమదంటూ సర్పంచ్ అలజంగి నారాయణరావు తగాదాలకు వస్తున్నారని రైతులు తెలిపారు. దీనిపై ఆయా సర్వే నెంబర్లు పరిశీలించిన సబ్ కలెక్టర్ సమగ్ర పరిశీలన జరిపి ఈ భూమి ఎక్కడుందో తమకు సమాచారాన్ని ఇవ్వాలని మండల సర్వేయర్‌ను సబ్‌కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో చెరువు ఉందని, అది కూడా తమ జిరాయితీ పొలమంటూ గ్రామ రైతు అంటున్నారని, ఉపాధి హామీ పనులు కూడా అక్కడ నిర్వహించుకుంటున్నారని అన్నారు. దీంతో కూలీలకు ఉపాధి లేకుండా పోతుందని దీన్ని పరిశీలించాలని రైతులు సబ్ కలెక్టర్‌ను కోరారు. ఆయా రైతులకు ఉన్న పత్రాలను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఆయా సర్వే నెంబర్‌లో ఉన్నటువంటి చెరువులు భూములను పరిశీలించి ఎవరివి ఏమిటన్నది సమగ్రంగా సర్వే నిర్వహించాలని మండల అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు.

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

దాబా పేరుతో మద్యం, విందు అక్కడే
చోద్యం చూస్తున్న ఎస్ఇబి, పోలీసు అధికారులు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

ఆరుబయట మద్యం సేవిస్తే చట్టరీత్యా నేరం. ఎక్కడా మద్యం తాగొద్దు అంటూ పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. గత వారం రోజులు నుంచి 100 మందికిపైగా కేసులు కూడా నమోదు చేశారు. అయితే పట్టణం నడిబొడ్డున దాబా పేరుతో మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మందుబాబులు అక్కడే మందు సేవిస్తూ విందును తీసుకుంటున్నారు. దాబా యజమానులు షాపుల నుంచి మద్యం తెచ్చి బాటిల్‌పై అదనంగా రూ.20 వరకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మనిషికి మూడు మద్యం సీసాలకంటే ఎక్కువ బాటిళ్లు విక్రయించరాదని నిబంధనలున్నప్పటికీ వాటిని తుంగలోకి తొక్కి ప్రభుత్వం మద్యం దుకాణాల్లో ఈ దాబా యజమానికి రోజుకు 25 బాటిళ్ల వరకు ఇస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే ఈ దాబాలో కేవలం భోజనం, అల్పాహారం అమ్మకాలకు అనుమతి ఉన్నప్పటికీ మద్యం ఏరులై పారుతుంది. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు సైతం దాబాలోనే మద్యం సేవిస్తున్నారు. పట్టణంలో ఇంత దారుణం జరుగుతున్నా ఎవరూ నోరు మెదపడం లేదు. దీంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

చోద్యం చూస్తున్న అధికారులు....

బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవంటూ పోలీసు అధికారులు ప్రకటనలు ఊదరగొడుతున్నారు. అయితే ఇక్కడ దాబా ఉన్నట్టు... దాబాలో మద్యం విక్రయాలు జరుగుతున్నట్టు తెలియదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ దాబాలో మద్యం ఏరులై పారుతున్నా ఎస్ఇబి అధికారులు గానీ, పోలీసు అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. దీంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం తనిఖీలు కూడా చేపట్టకపోవడానికి కారణమేమిటని పలువురు అంటున్నారు. సబ్ డివిజన్ కేంద్రంలో డిఎస్‌పి స్థాయి అధికారి ఉన్నప్పటికీ ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు పట్టణం నడిబొడ్డున జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదు. ఈ విషయంపై ప్రజాశక్తి ఎస్ఇబి అధికారులను వివరణ కోరడానికి ఫోన్ ద్వారా ప్రయత్నించినప్పటికీ వారు అందుబాటులోకి రాలేదు.

దాబాలో పడి ఉన్న మద్యం సీసాలు



7న గురుకులంలో ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - కొమరాడ

మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 7న పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో గల గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఏడో తేదీ ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆన్లైన్లో హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ప్రభుత్వం పరీక్ష రాసేందుకు మరో అవకాశం కల్పించిందన్నారు. ప్రవేశాల కోసం పరీక్ష రాసేందుకు అర్హులైన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో కళాశాలకు ఉదయం 10 గంటలకు వచ్చినట్లయితే వారికి పరీక్ష రాసేందుకు అనుమతి ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులంతా సకాలంలో పరీక్ష రాసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఇళ్ల నిర్మాణాలపై అధికారులను ప్రశ్నిస్తున్న పిఒ కల్పనకుమారి

అధికారులపై పిఒ ఆగ్రహం

ప్రజాశక్తి-పాలకొండ

అధికారులపై ఐటిడిఎ పిఒ కల్పనకుమారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో జగనన్న కాలనీ లేఅవుట్‌ను సందర్శించిన ఆమె ఇళ్ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో జరగకపోవడం పట్ల అసంతృప్తి చెందారు. ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని అధికారులను నిలదీశారు. అక్కడ నుంచి పట్టణంలో బుట్టుమతం ప్రాంతాన్ని సందర్శించి హౌసింగ్ లబ్దిదారులు ఇళ్లకు వెళ్లారు. అయితే ఒక ఇంటి దగ్గరకు వెళ్లి ఎందుకు ఇల్లు నిర్మాణం చేపట్టలేదని లబ్ధిదారులను ప్రశ్నించగా తనకు ఇల్లు మంజూరైనట్టు కూడా తెలియదని చెప్పడంతో ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సంబంధిత వాలంటీర్‌ను వెంటనే పిలిపించాలని అధికారులను ఆదేశించారు. పూర్తిగా అస్తవ్యస్థంగా ఉందని, అధికారుల పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. లేకుండా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈమెతో పాటు సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ కమిషనర్ సర్వేశ్వరరావు, డిటి బుచ్చియ్య, హౌసింగ్ ఎఇ మాధవరావు తదితరులున్నారు.



కారల్ మార్క్స్‌కు నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఘనంగా కారల్ మార్క్స్ జయంతి

కలెక్టరేట్ : కారల్‌మార్క్స్ 205వ జయంతిని శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మార్క్స్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.ఇందిర మాట్లాడుతూ మార్క్స్ 1818 మే 5న జర్మనీలోని ట్రియర్ పట్టణంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారని, మార్క్స్ జర్మన్ ప్రాచ్యవేత్త, తత్వవేత్త, ఆర్థికవేత్త, సామాజికవేత్త, పాత్రికేయుడు, సోషలిస్టు విప్లవకారుడుగా, ప్రస్తుత జర్మనీలోని ట్రియర్ పట్టణంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన మార్క్స్, రాజకీయ ఆర్థికశాస్త్రం, హెగెలియన్ తత్త్వశాస్త్రం చదువుకున్నారన్నారు. యుక్త వయసులో మార్క్స్ ఏ దేశపు పౌరసత్వం లేని స్థితిలో లండన్లో జీవితం గడిపారన్నారు. లండన్‌లో మరో జర్మన్ ఆలోచనాపరుడైన ఫ్రెడెరిక్ ఏంగెల్స్‌తో కలిసి తన చింతన అభివృద్ధి చేసుకుంటూ పలు పుస్తకాలు ప్రచురించాడన్నారు. 1848 నాటి కరపత్రమైన కమ్యూనిస్ట్ మేనిఫెస్టో వాటన్నింటిలోకీ సుప్రసిద్ధమైనదన్నారు. తదుపరి కాలపు మేధో, ఆర్థిక, రాజకీయ చరిత్రను అతని రచన ప్రభావితం చేసిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.అశోక్, వి.చిన్నం నాయుడు, ఎ.రామస్వామి, ప్రజా సంఘాల నాయకులు శాంతి, భాస్కరరావు, రేవతమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

సీతానగరం : మండలంలోని మరిపివలసలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులను అభివృద్ధి చేసుకోవడానికి ప్రభుత్వం వీలు కల్పించిందని ప్రతి చెరువును అభివృద్ధి చేసుకోవడానికి గ్రామస్తులు ముందుకు రావాలని అన్నారు. అలాగే చెరువు చుట్టూ మొక్కలు పెంపకం చేసి ఒక మంచి వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఉపాధి కూలీలు సరైన సమయంలో వచ్చి నిర్ణీత సమయంలో పని చేసుకుని వెళ్లాలని సూచించారు.

పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలి

పాచిపెంట : మండలంలోని కుడుమూరులో 48 సర్వేనెంబర్ 742 ఎకరాల ప్రభుత్వ భూమి సాగులో ఉన్న రైతులందరికీ వెంటనే పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలని గిరిజన సంఘం మండల అధ్యక్షులు సుకూరు అప్పలస్వామి అన్నారు. సర్వేలు చేసే వెంటనే సాగు పట్టాలిస్తామని కలెక్టర్ ఆదేశాలతో సర్వే బృందాలు సర్వేలు చేసిన సాగు హక్కు జాబితాలను నేటికీ బహిర్గతం చేయలేదని అన్నారు. వెంటనే తహశీల్దార్ కార్యాలయంలో, సచివాలయాల్లో సాగుహక్కుదారుల జాబితాలను వెల్లడించి గిరిజన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు, డిప్యూటీ సిఎం స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. పాడిఙ్గి వెంకట మాట్లాడుతూ కొండతామరు 113 సర్వే నెంబర్లు గిరిజనులు సాగు చేస్తున్న 210 ఎకరాల భూములకు వెంటనే హక్కులు కల్పించాలి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

క్షయ నివారణపై విస్తృత ప్రచారం

పార్వతీపురం రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యంగా పెట్టుకున్న టిబి విముక్త భారత్ కార్యక్రమం విజయవంతానికి అన్ని గ్రామాల్లోనూ క్షయరోగంపై విస్తృత ప్రచారం జరగాలని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో జిల్లాలోని ఇఒపిఆర్‌డిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో క్షయ రోగ బృందాల నివారణ లక్ష్యంగా ప్రతి గ్రామంలోని వైద్య సిబ్బంది చేయాలని, మండల పరిధిలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ సెంటర్లలో ఆయా సిబ్బంది క్షయవ్యాధి నివారణ అధికారులతో సమన్వయపర్చుకొని ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహించి ప్రజల్లో ఈ వ్యాధిపై చైతన్యం కలిగించాలన్నారు. అనంతరం జిల్లా టిబి నివారణ అధికారి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ క్షయ రోగ లక్షణాలు రోగుల గుర్తింపు, టిబి పరీక్షలు నివారణ మార్గాలు, మందుల పంపిణీ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన 15మండలాల ఇఒపిఆర్‌డిలు, క్షయ రోగ నివారణ వర్కర్లతోపాటు జిల్లా ప్రోగ్రాం అధికారులు ఎస్.కుమార్, జె.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

చోరీకి గురైన దుకాణాల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం : స్థానిక బిఎస్ఆర్ కల్యాణమండపం సమీపాన ఓ దుకాణంలో నెలరోజుల వ్యవధిలో రెండుసార్లు దొంగతనం జరగడం గమనార్హం. దుకాణం నిర్వాహకులు గుడ్ల సరస్వతి చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ దుకాణం గ్రామానికి శివారున ఉండడంతో అదే అదునుగా దొంగలు రెండుసార్లు షాపులోకి చొరబడి మొదటిసారి రూ.10వేలు సొత్తును, రెండోసారి రూ.30వేల సొత్తును కాజేశారు. ఈ చోరీ గురించి తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్‌రావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, వర్తక సంఘం అధ్యక్షులు కొక్కెరెట విష్ణుప్రసాద్ నిర్వాహకులను పరామర్శించి ఓదార్చారు. చోరీకి పాల్పడేవారిని గుర్తించి కఠినంగా శిక్షించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేసే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఎటువంటి దొంగతనాలు, అక్రమ వ్యాపారాలు జరిగితే పోలీసులకు తెలపాలని సూచించారు.

ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలి

వీరఘట్టం : ఆదాయము వచ్చే వనరులపై దృష్టి పెడితే ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఆ దిశగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ వై.వెంకటరమణ సిఎఫ్‌లకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వివిధ రకాలైన పథకాల ద్వారా ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా చర్యలు తీసుకుంటుందని, ప్రతి ఒక్కరూ వీటిని వినియోగించుకొని అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎం జి.శ్రీన్నాయుడు, ఎపిఒ సత్యనారాయణ, పశు వైద్యాధికారి చైతన్యశంకర్, మండల మహిళా సమైక్య అధ్యక్షులు పి.సుజాత, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు జి.బలరాం, సిజి వై.ఆనందరావు, సంఘ సభ్యులు, సిసిలు, సిఎఫ్‌లు పాల్గొన్నారు.

ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

మక్కువ : మండలంలోని ములక్కాయవలస ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్లో 2023- 24 ఆరో తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.సత్యవతి తెలిపారు. శుక్రవారం ఆమె ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 9 నుంచి 25 తారీకు వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె అన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 బిసి, ఒసి విద్యార్థులు రూ.150 ఆన్లైన్ రుసుము చెల్లించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. ప్రవేశానికి పరీక్ష కేంద్రం జూన్ 11న పరీక్ష కేంద్రం ఎపి మోడల్ స్కూల్, ములక్కాయవలసలో ఉదయం 10 నుండి 12 గంటల వరకు ఉంటుందని అన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సాలూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఆమె నివాసంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన కార్మికులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు మేస్త్రి మాధవన్ పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. కార్మికుల హెల్త్ అలవెన్సును రెగ్యులర్‌గా అందజేయాలని కోరారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు చెందిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సబ్బులు, నూనెలు, చెప్పులు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.రాము, శ్రీను ఉన్నారు.



చైర్‌పర్సన్‌కు వినతిని అందజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సిఐటియు నాయకులు

అభ్యర్థులకు ప్లేస్ మెంట్ ఉత్తర్వులు

ప్రజాశక్తి - పార్వతీపురం

నైపుణ్యాభివృద్ధి సంస్థలో శిక్షణ పొందిన 22 మంది అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్లేస్‌మెంట్ ఆర్డర్లు అందించారు. కలెక్టరు కార్యాలయంలో శుక్రవారం అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్నందుకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. నైపుణ్యం మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ ఉద్బోధించారు. సొంత కాలుపై నిలబడాలని ఆయన సూచించారు. ఉద్యోగ బాధ్యతలు చక్కగా నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు తేవాలని, ఉపాధి కోసం ఎదురు చూసే వారికి స్ఫూర్తిగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలను మెరుగుపర్చి వారికి ఉపాధి బాటలు వేసేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సంస్థ అడుగులు వేస్తోందన్నారు.



ఎంపికైన అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఇందులో భాగంగా గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ, ఎంఆర్ నగరం, పార్వతీపురం స్కిల్ హబ్ లో ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ కోర్స్‌లో 28మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని, అందులో 22మంది విశాఖపట్నంలో గల అరౌనా ఇంజనీరింగ్ అండ్ సర్వే సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఎంపిక అయ్యారని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్స్, సర్టిఫికెట్స్ అందిచడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్యాభిద్ధి సంస్థ సిబ్బంది, అభ్యర్దులు పాల్గొన్నారు.

మైక్రో ఎటిఎం ద్వారా పాస్ బుక్ ప్రింటింగ్ సేవలు

జియ్యమ్మవలస : దేశంలోనే మొదటిసారిగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో మైక్రో ఎటిఎం ద్వారా పార్వతీపురం రీజయన్ జియ్యమ్మవలస బ్రాంచ్ ఎపిజివిబి మిత్ర డి.జగన్నాధం నాయుడు వద్ద జిల్లా ఎల్‌డిఎం జెఎల్ఎం మూర్తి, ఎపిజివిబి బిజినెస్ మేనేజర్ సోమేశ్వరరావు మైక్రో ఎటిఎం ద్వారా పాస్‌బుక్ ముద్రణను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎల్‌డిఎం మాట్లాడుతూ మైక్రో ఎటిఎం ద్వారా పాస్‌బుక్ ప్రింటింగ్ సేవలయ్యేలా టెక్నాలజీని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అభివృద్ధి చేసినట్టు వంటి ఐరిక్స్ టెక్నాలజీ సంస్థను ప్రత్యేకంగా అభినందించారు. బిజినెస్ మేనేజర్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఖాతాదారుడు ఉచితంగా పాసుబుక్ సేవలను పొందవచ్చన్నారు. గ్రామస్తులకు పాస్ బుక్ ముద్రణ ప్రాముఖ్యత గురించి వివరించారు. దేశంలో ఉన్న అన్ని టెక్నాలజీల కంటే ఐరిక్స్ టెక్నాలజీలు వారు చేస్తున్న అభివృద్ధిని ఎంతగానో అభినందించారు. ఇలాగే మిగతా బ్యాంకు మిత్ర పాయింట్లలో కూడా ఇలాంటి ప్రింటర్ సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు. ఐరిక్స్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కనకరాజు మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిగా జియ్యమ్మవలసలోనే ఈ ప్రింటర్ సదుపాయం కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ఆఫీసర్ కిరణ్ కుమార్, ఐరిక్స్ టెక్నాలజీ సంస్థ స్టేట్ ఇంఛార్జి చిరంజీవి, ఆర్ఒ హెడ్ వెంకటరమణ, ఛానల్ మేనేజర్లు వినోద్, కార్తీక్, సాయి, బ్యాంక్ మిత్ర డి.జగన్నాధ నాయుడు పాల్గొన్నారు.



గ్రామస్తులతో చర్చిస్తున్న పిఒ విష్ణుచరణ్

పెట్రోల్ బంకు నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో ఐటిడిఎ ద్వారా మంజూరైన పెట్రోల్ బంక్ నిర్మాణానికి మంతినివలస సమీపానున్న శ్మశాన వాటికకు దగ్గర ఉన్న స్థలాన్ని శుక్రవారం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మంతినివలస గ్రామ ప్రజలు శ్మశాన వాటిక ఇది ఒక్కటే ఉందని, వేరే దగ్గర పెట్రోల్ బంక్ నిర్మించి తమ శ్మశాన వాటిక స్థలాన్ని విడిచి పెట్టాలని పిఒకు తెలిపారు. శ్మశాన వాటికకు సరిపడే స్థలాన్ని విడిచి పెడుతూ చుట్టూ ప్రహరీ, బోరును తవ్వించి ఇచ్చి మంతినివలస గ్రామస్తులకు 15 మందికి పెట్రోల్ బంక్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఆర్ఐపిఎల్ వి ప్రసాద్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ కేలండర్ విడుదల చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన కురుపాం లో శుక్రవారం టిడిపి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వి.దివాకర్ ఆధ్వర్యంలో జరిగిన జాబ్ క్యాలెండర్ పై నిరసన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా ఆమె హాజరై యువతతో కలిసి టిడిపి కార్యాలయం దగ్గర ప్లే కార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేక చెడు వ్యసనాలకు బానిసవుతున్నారని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, టిడిపి నాయకులు దొంకాడ రామకృష్ణ, కన్నా, సుఖేష్ చంద్రపండ, సురేష్, సాయి, రాంబాబు , యువత పాల్గొన్నారు.



కురుపాంలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

మాదక ద్రవ్యాలకు నిలయం ఆంధ్రప్రదేశ్

సాలూరురూరల్ : వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి మాదక ద్రవాలకు నిలయంగా మార్చేసిందని టిడిపి సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ దేశానికి అన్నపూర్ణగా ఉండేదని, ఇప్పుడు జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మాదక ద్రవ్యాలు ఎగుమతులకు దేశంలో నంబర్ వన్ గా ఉందని ఎద్దేవా చేశారు. మండలంలోని కురుకుట్టిలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతకు సరైన ఉపాధి లేక ఎందరో యువకులు, విద్యార్థులు గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. యువత జీవితాలు మారాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే ఈ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేకుండా అవుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో రామన్నదొర, లక్ష్మణ దొర, వెంకటరమణ, రవి, మద్దిల కృష్ణ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని పులిగుమ్మి పంచాయతీ, లచ్చిరాజుపేటకు చెందిన వైసిపి కార్యకర్త సెట్టి శంకరరావు ఇటీవల ప్రమాదవశాత్తూ మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి కార్యకర్తను పార్టీ కోల్పోయిందని బాధపడుతూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి ధైర్యం కల్పించి ప్రభుత్వం, పార్టీ తరుపున అన్ని విధాలా అండగా నిలిచి ఆదుకుంటామని అన్నారు. అనంతరం బందులుప్పిలో జరిగిన గడపగడపకు మన కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి పార్టీకి మద్దతు కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి శోభారాణి, నాయకులు బలగ నాగేశ్వరరావు, యాళ్ల ప్రతాప్, బొమ్మి రమేష్, జక్కు ప్రవీణ్ కుమార్, కొత్తాడ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో గడప గడపకు...

కురుపాం : మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ దండుసుర, గంగన్నదొరవలస, దండుసురగూడ, నీలకంఠాపురం గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయా లేదని వారి దగ్గర నుంచి సమాచారం తెలుసుకొని ఇంకా ఏమైనా సమస్యలుంటే వాలంటీర్లకు తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎ. మన్మధరావు, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైస్



శంకరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఎంపిపిలు రంగారావు, బి.అన్నాజీ రావు, ఎఎంసి చైర్మన్ ఎన్. వెంకట్రావు, సర్పంచులు హెచ్.నాగేశ్వరరావు, బి.మిన్నారావు, వైసిపి నాయకులు షేక్ ఆదిల్, ఆకుల శ్రీధర్, రాయపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో ధారపాడు సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం రామానగరం, దబర, దబర గూడ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంక్షేమ పథకాల గురించి వివరించారు. గిరిజనులకు అండగా జగనన్న ప్రభుత్వం ఉంటుందన్నారు. గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గిరిజనుల కష్టసుఖాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ఆదినారాయణ, ఎంపిడిఒ కె.సత్యం, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

పార్వతీపురంటౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపి మీరు ప్రమాదాలకు గురై ఇతరులను ప్రమాదాలకు గురి చేయొద్దని పట్టణ ఎస్ఐ ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలను నడుపుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని పరీక్షలు నిర్వహించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మీరు ప్రమాదాలకు గురై ఇతరులను ప్రమాదాల బారిన పడవేస్తున్నారని, ఇలాంటి సంఘటన వల్ల రెండు కుటుంబాలు పోలీస్ స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పాలవుతున్నారని అన్నారు. మద్యం సేవించి ఎవరూ వాహనాలు నడపవద్దని డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు ఉండాలని హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని అన్నారు.

పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు

సీతానగరం : మండలంలోని కాశీపేట, జోగింపేటలో ఆయా గ్రామాల సర్పంచులు తేలు సింహాచలం, కల్యంపూడి సింహాచలం ఆధ్వర్యంలో పారిశుధ్యం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ దేవత పండగ సందర్భంగా గ్రామాలకు ఇరువైపులా పారిశుధ్యం పనులు చేపట్టి శుభ్రం చేస్తున్నామన్నారు. అలాగే కాశీపేట ఎస్సీ వీధిలో పారిశుధ్య చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి.మురళీకృష్ణ, సిహెచ్ కిరణ్, గ్రామ పెద్దలు, వాలంటీర్లు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు, సిఐటియు నాయకులు

సిహెచ్‌డబ్ల్యులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఉపాధి హామీ పనులకు వెసులుబాటు కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావుకు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో కలిసి సిఐటియు ఆధ్వర్యంలో వినతిని అందజేశారు. అనంతరం సాంబమూర్తి, సిహెచ్‌డబ్ల్యు మండల నాయకులు కె.దుర్గ మాట్లాడుతూ సిహెచ్‌డబ్ల్యుఒకు వచ్చే అరకొర వేతనంలో అవస్థలు పడుతున్నారని, దీంతో వీరు వెసులుబాటు చూసుకొని ఉపాధి పనులకు వెళ్తున్నారన్నారు. అయితే ఇటీవల ఉపాధి పనులకు రావద్దని చెప్పడం జరిగిందని, ఇది చాలా అన్యాయమని అన్నారు. పూర్తి కాలం పనిచేసినప్పుడు కూడా తగినంత వేతనం లేక ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలై పరిస్థితి ఉందని అన్నారు. ఏది ఏమైనా ఈ పనులకు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు వద్దనడం సరికాదని ఎంపిడిఒకు తెలిపారు. దీనికి ఎంపిడిఒ స్పందిస్తూ రోజు తప్పించి రోజు ఉపాధి పనులు కనిపిస్తామని చెప్పారు. దీనికి సిహెచ్‌సిలు అభ్యంతరం వ్యక్తం చేశారు. రోజు తప్పించి రోజు పని కల్పిస్తే ప్రయోజనమేమిటని ప్రశ్నించారు. కావున వెంటనే కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ప్రతిరోజు ఉపాధి పని కల్పించాలని కోరారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణవేణి, మంజు, రవణమ్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

వీరఘట్టం : మండల కేంద్రంలోని భారత గ్యాస్ గోడౌన్ వద్ద శుక్రవారం స్థానిక ఎస్సై పికిషోర్ వర్మ వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. అందుబాటులో ధ్రువపత్రాలు ఉంచుకోవాలన్నారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

కాలువలపై ఆక్రమణలు తొలగించి పూడిక తీత

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 27వ వార్డు సిరేల వీధిలో ఉన్న మురుగు కాలువలపై గల ఆక్రమణలు తొలగించి పూడిక తీతలు జరుగుతున్న పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా సుమారు 4 వార్డులకు చెందిన వాడుక నీరు, వర్షపు నీరు ఇదే కాలువ ద్వారా ప్రవహించేందుకు అవకాశం ఉన్నందున ముందస్తుగానే ఈ కాలువలో పేరుకుపోయిన పూడికలను తొలగించే చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆక్రమణలు తొలగించామని, భవిష్యత్తులో కాలువులపై ఆక్రమణ చేస్తే చర్యలు తప్పని అన్నారు.

విధులకు ఎంఎల్‌హెచ్‌పి గైర్హాజరు

ఇఒపిఆర్‌డి పరిశీలనలో వెల్లడి

ప్రజాశక్తి-జియమ్మవలస

మండలంలోని అర్నాడ పంచాయతీ ఎంఎల్‌హెచ్‌పి గైర్హాజరైనట్లు ఇఒపిఆర్‌డి పరిశీలనలో వెల్లడైంది. శుక్రవారం అర్నాడ సచివాలయాన్ని ఇఒపిఆర్‌డి కొండగొర్రె రామారావు ఆకస్మిక తనిఖీ చేశారు. విధులకు హాజరు కావాల్సిన సచివాలయ ఎంఎల్‌హెచ్‌పి విజయలక్ష్మి హాజరుపై ఆయన ఆరా తీశారు. గత 15 రోజులుగా విధులకు గైరహాజరవుతున్నట్లు స్థానిక గిరిజన ప్రజానీకం ఇఒపిఆర్‌డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎంఎల్‌హెచ్‌పికి మహిళా పోలీసు చరవాణిలో సంప్రదించగా ఇఒపిఆర్‌డితో మాట్లాడ్డానికి ఆమె నిరాకరించింది. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్న ఎటువంటి సలహాలు, సూచనలు ఇవ్వడం లేదని అసలు ఎంఎల్‌హెచ్‌పి ఎవరో తమకు తెలియడం లేదని గిరిజనులు ఇఒపిఆర్‌డి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయ ఎఎన్ఎం పోస్టు లేకపోవడంతో ఎంఎల్‌హెచ్‌పి మాత్రమే విధులను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అందజేసిన లాప్ టాప్, ఫ్రిడ్జ్ తదితర వస్తువులు కూడా సచివాలయ పరిధిలో లేకపోవడం విశేషం. మందులను భద్రపర్చాల్సిన శీతలీకరణ వస్తువులను ఎంఎల్‌హెచ్‌పి ఎక్కడ ఉంచారో కూడా తెలియని పరిస్థితి ఇఒపిఆర్‌డి పరిశీలనలో వెల్లడయ్యింది. ఈ విషయంలో వైద్యాధికారులు, హెచ్‌విల పర్యవేక్షణ లోపం కొట్ట వస్తున్నట్లు కనిపిస్తున్నది. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, గిరిజనులకు అందించే వైద్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తూ తమ ఇష్టానుసారం వ్యవహరించడం పట్ల ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఇఒపిఆర్‌డి విలేకరులకు తెలిపారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో గ్రామాల్లో వైద్యసేవలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

గ్రామాల్లో ప్రబలే అన్ని రకాల రోగాలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలు చికిత్స పొందేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కృష్ణపల్లిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సందర్శించి నమోదు చేసిన రోగుల వివరాలను పరిశీలించారు. రికార్డులు పక్కాగా ఉండాలని ఆదేశించారు. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్‌గా వచ్చే వ్యాధులు, జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపి తగ్గే వరకూ వైద్య సిబ్బంది పర్యవేక్షణ చేయాలని సూచించారు. అవసరమైన వారికి టెలిహబ్ ద్వారా స్పెషలిస్టు వైద్యులను సంప్రదించి తగు దిశా నిర్దేశం చేయాలన్నారు. అనంతరం శిబిరం వద్ద, 104 వాహనంలో మందులను, పరికరాలను పరిశీలించి వైద్య సిబ్బందికి వాటిపై ఉన్న పరిజ్ఞానంపై పరిశీలించారు.కార్యక్రమంలో డాక్టర్ సాహితి, సూపర్ వైజర్ జయలక్ష్మి, జయగౌడ్, వైద్య సిబ్బంది నిర్మల, రాజేశ్వరి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నడిమికెల్లలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం: మండలం నడిమికెళ్లలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భముగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణులు, మధుమేహం, రక్త పోటు, జ్వర పీడితులకు తదితరమైన వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నవోనమ్మ, టెక్నీషియన్ దినేష్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పాచిపెంట

రాబోయే ఖరీఫ్‌కు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూసుకోవాలని, ప్రతి నెలా మొదటి శుక్రవారం రైతు భరోసా కేంద్రాల్లో జరుగుతున్న గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో భాగంగా మాతుమూరు వ్యవసాయ సలహా మండలి సమావేశంలో సలహా మండలి చైర్మన్ శనగల సింహాచలం మాట్లాడారు. గత ఏడాది కంటే భిన్నంగా మరింత జాగ్రత్తగా రైతు భరోసా కేంద్రం రైతులకు సహాయ సహకారాల అందాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చూడాలని కోరారు. సలహా మండలి సభ్యులు బోను ధనంజయరావు మాట్లాడుతూ ఈ ఏడు ఇప్పటికే యూరియా, డిఎపి తెప్పించామని, గ్రామంలో చిరు ధాన్యాల విస్తరణకు కూడా ప్రణాళిక సిద్ధం చేశామని, రైతులు కేవలం రసాయన ఎరువులపై మాత్రమే ఆధార పడకుండా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రకృతి సేద్యం వైపు మళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం ఎఒ కె.తిరుపతిరావు మాట్లాడుతూ మండలానికి 1641 టన్నుల యూరియా, 301 టన్ను డిఎపి, 883 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 363 టన్నుల పొటాష్ ఖరీఫ్, రబీకి అవసరమని, వెయ్యి టన్నుల యూరియా, 170 టన్నుల డిఎపి, 70 టన్నుల పొటాష్, 150 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. అలాగే 80 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు, 750 క్వింటాళ్ల వరి విత్తనాలు, 60 క్వింటాళ్ల చిరుధాన్యాలు సిద్ధం చేశామని తెలిపారు. ఎరువులకు, విత్తనాలకు ఎలాంటి కొరత ఉండదన్నారు. వైయస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేశామని, ఏ రైతు భరోసా కేంద్రం పరిధిలోనైనా కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు కాకపోతే రెండో కస్టం హైరింగ్ సెంటర్ అవసరం ఉన్న రైతు భరోసా కేంద్రానికి మంజూరు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విఎఎ దినేష్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ దేవత పండగకు ఏర్పాట్లు

సీతానగరం : మండలంలోని పెద్ద భోగిలి పంచాయతీ పరిధిలో గల అప్పయ్యపేట, బుడ్డిపేట, సీతానగరం, పెదబోగిలిలో ఈనెల 8, 9, 10 తేదీల్లో బోగుతల్లి గ్రామ దేవత పండగ నిర్వహణకు నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా సినిమానోత్సవానికి వెళ్లేందుకు ముందుగా ఆయా రూట్లను గుర్తించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పార్కింగ్‌కు ఇబ్బందుల్లేకుండా గ్రామ సర్పంచ్ తేరజమ్మ, గరికయ్య ఉత్సవ కమిటీ సభ్యులు కె.అరవింద్ కుమార్, పి.పైడపునాయుడు, సురేష్, రామారావుతో పాటు గ్రామ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చూస్తున్నారు.

ఆరోగ్యకరమైన పంటలు పండించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రతి రైతు ఆరోగ్యకరమైన పంటలను పండించేలా ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది కృషి చేయాలని ఆ సంస్థ రీజినల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు రావచ్చని అన్నారు. ఇప్పటికే మండలంలో 48 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి వ్యవసాయం సాగు చేస్తున్నారని అన్నారు. అలాగే అన్ని గ్రామాల్లోనూ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించేలా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సదుపాయం కూడా అందించేందుకు భరోసా ఇవ్వాలని సూచించారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ మండలాన్ని శతశాతం ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దేందుకు తమ సంస్థ సిబ్బంది కృషి చేస్తుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జట్టు సంస్థ ట్రస్టీ డాక్టర్ డి.పారి నాయుడు, ప్రకతి వ్యవసాయం ఎడిషనల్ డిపిఎం ధనుంజయ్ రావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు, ఎంటిలు జి.నిర్మలాదేవి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.